
నేను బాగా ముదిరిపోయిన బెండకాయని. అప్పటికీ, పెళ్ళిళ్ళ మార్కెట్లో నా రేటు బ్రహ్మాండంగా పలుకుతోంది. ఈసరికి దగ్గిర దగ్గిర ఇరవైమంది ఆడపిల్లల్ని చూసేను. ఎవరూ నాకు నచ్చలేదు. కారణాల లిస్టు చెప్పటం ప్రారంభిస్తే అదో పెద్ద గ్రంధం అయిపోతుంది.... నాకిప్పుడు ముప్ఫయి రెండేళ్ళు. చక్కగా ఓ ఫస్ట్ క్లాసు కంపెనీలో ఆఫీసర్ గా పనిచేస్తున్నాను. నెలకి ఎనిమిది వందలు లక్షణంగా అందుకుంటున్నాను. పెద్ద అందగాణ్ని కాను. కాని ఆడపిల్లల్ని కట్టించే శరీర సౌష్టవం నాది. అందుకు కాలేజీలో చదివే రోజుల్లో నాకొచ్చిన ప్రేమలేఖలే సాక్షి.



తలిదండ్రులకు ఒక్కడిని, పాతిక వేలంటూ ఒకరూ - ముప్ఫై వేలంటూ ఒకరూ మావాళ్ల వాదించుకుంటోంటే - నే నసలిలాగైతే పెళ్ళే చేసుకోనని భీష్మించుకూర్చున్నాను.... చేసుకుంటే పైసా కట్నం తీసుకోవడానికైనా నసేమిరా వీల్లేదన్నాను. పాపం, మావాళ్ళు 'అలాగే కానీ. అబ్బాయ్' అన్నారు. నాలాంటి పెళ్ళికొడుకు ఎవరికి అక్కర్లేదు? చెప్పండి అంతో ఇంతో అందగాణ్ని.... గ్రాడ్యుయేట్ ని ...లక్షణమైన ఉద్యోగస్తుడిని. ఎవ్విధమైన చెడు నడతా - దురభ్యాసాలూ లేనివాడిని ... కట్నం తీసుకోకుండా వివాహం చేసుకుందామన్న స్థిర నిశ్చయం కలవాడిని .... నాలాంటి అల్లుడి కోసం ఎందరు మామగారు అర్రులు చాస్తుంటారో నాకేమీ తెలీని కాదు. అయినా, నాకు నచ్చిన పిల్ల దొరకలేదు. ఎంత దురదృష్టం! అప్పటికీ అనుక్షణమూ నేను అ ధ్యాసలోనే వుంటున్నాను. శాఖాంతరమైనా - వర్ణాంతరమైనా ఫర్వాలేదని మరో సవరణ చేసేను. ఇక కాబోయే భార్యను గురించి నా ఊహాలు:

అమ్మాయి నాలాగే తెల్లగా పొడుగ్గావుండాలి. ముసిమిన్నగొంపే అందం అక్కర్లేదు. ముఖం కాస ఆకర్షణీయంగా మాత్రం వుండాలి. పోస్టు గ్రాడ్యుయేట్ అయినా ఫర్వాలేదు. కాని, నానాకాలం చదువు మాత్రం లాభం లేదు. అన్నిటికన్నా మిన్నగా అణకువా సహృదయతా వుండాలి. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కావే! అయినా నాకే పిల్లా నచ్చలేదు. అందుకే పెళ్ళి కాలేదు.

ఒక్కొక్కప్పుడు నాకీ ఒంటరితనం ఎంతో చికాకు వేస్తుంటుంది.

పోసి. మా వాళ్ళని వచ్చి వుండమందామా — అంటే అదీ వీల్లేకపోయింది. కోడలుపిల్లలేని ఇంట్లో కాలు పెట్టమంటూ భీష్మించుకూర్చున్నారు మా వాళ్ళు. మేకపిల్లలా వాళ్ళు చూపించిన పిల్ల మెడలో తాళి కట్టడమో - ఒంటరితనమో - ఏదో ఒకటి తప్పదనిపిస్తోంది. అయినా నాకు భవిష్యత్తుమీద అనంతమైన నమ్మకం వుంది. నాకు నచ్చిన పిల్ల ఎప్పటికేనా జీవితంలో తటస్థ పడుతుందన్న విశ్వాసం వుంది. ఆ విశ్వాసమే లేకపోతే "మొనోజు"గా వుండే పగళ్లూ - "గ్లూమీ" రాత్రుళ్లూ ఇన్నాళ్ళుగా గడపగలిగేవాణ్ణి కానేమో!

మత్తెక్కించే మల్లెపువ్వుల మధుర వాసనలు ఇచ్చే సౌఖ్యం, నా బాహువుల్లో కరిగే పాలపిట్ట ముఖంలోని చిరునవ్వి చ్చే ఆనందం, మనసూ మనసూ కలిపే - మర్మాల్లేని మనిషి సాంగత్యంలోని మధురిమలూ నే నూహించగలను. నా అంత పక్కా ఆశావాది లోకంలో ఎవడూ వుండడు .... ఏ అమ్మాయీ నాకెందుకు నచ్చటం లేదు? లోపం వాళ్ళదా - లేక నాలోనే వుందా? ఎప్పుడూ లేనిది ఈ మధ్య ఈ అనుమానం పెనుభూతంలా చూస్తూ నావేపు వికటాట్టహాసాలు కురిపిస్తోంది. మనస్సుని చీల్చి చెండాడుతూ చిత్రవధ చేస్తోంది....

సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది. ఆఫీసునుంచి బయటపడి అలా బీచ్ వేపు బయల్దేరేను. ఇసుకలోకి దిగి ఓ మూలగా కూర్చున్నాను. అంతలో ఎవరో జంట నా ముందు నుంచే వెళ్ళి - కాస్తంత దూరంలో కూర్చున్నారు. అప్రయత్నంగా అటే చూశాను .... ఇద్దరూ నవదంపతుల్లా వున్నారు. అసూయతో నా ఒళ్ళు వుడికిపోసాగింది. దృష్టి మళ్ళించి కెరటాల వేపు తిరిగేను .... నా ఖర్మ కాకపోతే ఏమిటిది? హూఁ అంటే చాలు మా వాళ్లు నాచేత మూడుముళ్ళూ వేయించేస్తారు....ఆపైన నేనూ వాళ్ళలాగే.... చూడకూడదనుకుంటూనే మళ్ళీ ఆ జంట వేపు చూసేను. నే నొక్కణ్ణి పక్కని వున్నానన్న ధ్యాసే లేదు వాళ్ళకి. అతుక్కుపోతున్నట్టు దగ్గరగా కూర్చొని ఏమిటేమిటో మాటాడేసుకుంటున్నారు. ఆమె వున్నట్టుండి గలగలా నవ్వుతోంది. ఆ నవ్వు ఒకో అప్పుడు నిశ్శబ్దంగా పారే సెలయేరులా, రేకలు విప్పుకుంటోన్న గులాబీలా, రాగమయి అనురాగ వీణలా గంభీరంగా - సున్నితంగా, మధురంగా వుంది. కెరటాల రొదలో వాళ్ళ మాటలు మాత్రం నా చెవికి అందటంలేదు.

వాళ్ళిద్దరూ భార్యాభర్తలే అయివుంటారు. అందుకే అంత స్వేచ్ఛగా నిర్భయంగా వెల్తుర్లో కూర్చున్నారు. ప్రేయసీ ప్రియులైతే ఏ చీకటి నీడల్లోనో, రాళ్ళ వెనుకనో నక్కివుండేవారు. వాళ్ళని చూస్తుంటే-చెప్పొద్దూ, నాకు బలే ముచ్చట వేసింది ...క్రమేపీ

"అతని" అదృష్టానికి నాలో ఈర్ష్య కూడా చెలరేగసాగింది. మంత్రముగ్ధుడిలా అటే చూడసాగేను. అలా ఓ గంట గడిచిందేమో .... అతనేదో చెప్తున్నాడు .... ఆమె మౌనంగా వింటోంది. వుండి వుండి ఏదో సమాధానం చెప్తోంది...."ఎంత అందమైన జంట!" అనుకున్నాను, మరోసారి. ఉన్నట్టుండి ఆమె ఎందుకో వెనక్కి తిరిగి నన్ను చూసింది. వెంటనే తల తిప్పేసింది .... నా కళ్లు ఒక్కసారి జిగ్గుమన్నాయి. నిస్సందేహంగా ఆమె ఎంతో అందగత్తె....కాని, ఆ ముఖం నాకు బాగా తెలిసిందే - ఆమె నాకు బాగా తెలుసు....ఎక్కడ? ఎలా?? మనస్సులో పేరుకున్న పొరల్ని ఒత్తిగించాలి....ఆ పొరల అట్టడుగున వున్న జ్ఞాపకాల తెరల్ని ఛేదించాలి.... ఎవరు....? ఎవరామె....?

అంతలో వాళ్ళిద్దరూ హఠాత్తుగా లేచి నా ముందునుంచి నడవసాగేరు. ఆ నడక....ఆ వయ్యారం....నే నెరిగినవే! ఎప్పుడు....? అలా ఇసుకలోంచి నడిచి రోడ్డుమీకి ఎక్కేరు, కనుమరుగయ్యేదాకా—కళ్లు మంటలు పుట్టేదాకా అటే చూసేను....అప్పుడు గుర్తొచ్చింది. ఆమె ఎవరో కాదు. రేఖ. శశిరేఖ! అవును శశిరేఖే!!

* * *

అయిదేళ్ళ క్రిందట....

అప్పుడు నేను బెజవాడలో వుండేవాడిని. ఇదే వుద్యోగం. ఇదే హోదా. ఓనాడు మా నాన్నగారి దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. "ఒరే అబ్బాయ్, ఫలానా నరసింహమూర్తిగారు నాకు ఫ్రెండ్. అతనికి ఓ అమ్మాయి వుంది. వెళ్ళి చూడు. నచ్చితే చూదాం" అవటాని రాసేరు. ఆ రోజో ఆ మర్నాడో ఆ ఫలానీ నరసింహమూర్తిగారింటికి వెళ్ళేను.

నరసింహమూర్తిగారికి గుణదలలో పెద్ద బంగళా వుంది. బంగళాగేటుకి "జిర్. నరసింహమూర్తి అండ్ కో; ఇంజనీరింగ్ కంట్రాక్టర్" అన్న బోర్డుంది. లోపల గేరేజ్‌లో పెద్ద కేడిలాక్ కారూ, పోర్టికోలో చిన్న బ్యూక్ కారూ వున్నాయి. దానికాస్త ఎడంగా పంచకల్యాణిలాంటి రాజ్‌దూత్ మోటార్ బైక్ వుంది. మేడ ముందు చక్కని పూలతోట వుంది. అందులోంచి నడిచి అరుగెక్కేను. నరసింహమూర్తిగారూ, వారి భార్యా నన్నెంతో ఆదరంగా ఆహ్వానించేరు. సోఫాలో కూర్చోబెట్టి కుశలప్రశ్నలు వేసేరు. కాసేపు అవీ ఇవీ మాటాడుకున్నాక మూర్తిగారి సతీరత్నం లోపలికి వెళ్ళి - మరో అయిదు నిమిషాల్లో మళ్ళీ వచ్చింది. ఆమె వెనగ్గా ఓ అమ్మాయి చిన్న ట్రేతో కాఫీ బిస్కట్లూ తెచ్చి నా ఎదురుగుండా వున్న టీపాయ్‌మీద పెట్టింది.

ఆ అమ్మాయి వేపు సర్వంగా

చూస్తూ "మా అమ్మాయి శశిరేఖ...." అన్నారు నరసింహమూర్తిగారు.

"నమస్తే" అందా కలకంఠి రెండు చేతులూ జోడించి.

"నమస్తే"అన్నాను ఓ క్షణంపాటు ఆమెకి కళ్ళప్పగించేసి.

ఆ తర్వాత ఆ అమ్మాయి వాళ్ళమ్మగారి పక్క సోఫాలో కూర్చుంది.

"మా అమ్మాయి గురించి గొప్ప చెప్పుకోవడం కాదుగాని, నాయనా! చిన్నప్పట్నించీ అది మహా తెలివితేటల్తో పెరిగింది. బియ్యే చదువుతున్నాదిప్పుడు. ఇంకో ఆర్నెల్లుపోతే చక్కా డిగ్రీ చేతికొచ్చేస్తుంది. వీణ వాయిస్తుంది, పాడుతుంది కూడాను...." అంటూ చెప్పుకుపోతూంది మూర్తిగారి సతీమణి.

"పాటేదేనా పాడిస్తే బాగుణ్ను!" అనుకున్నాన్నేను.

"హైస్కూల్నుంచి కాలేజీదాకా పాటల్లో ఆటల్లో పోటీల్లో ఫస్టుప్రయిజులన్నీ దీనివే!" అందామె.

"వూరుకో అమ్మా. నువ్వు మరీనూ...." అంది శశిరేఖ కాస్త




కోపం - కాస్త అలక కంఠంలో పలికిస్తూ

"ఏఁ, ఏఁ.... చెప్తే తప్పేం?"

నేను అమ్మాయిని సూటిగా చూడలేక పోతున్నానుగాని - అప్పుడప్పుడు చూసే దొంగచూపుల్లో ఆ అమ్మాయి చక్కటి పిల్ల - ఓ మాదిరి అందగత్తె అని నిర్ధారణ చేసేసుకున్నాను. నేనిన్నాళ్ళూ కలలు కంటూన్న ఊహా ప్రేయసి ఈమే నని దృఢపర్చుకొన్నాను. సంతోషం నా గుండె నిండా నిండిపోయింది ...వెంటనే నాన్నగారికి 'ఎస్' అంటూ ఉత్తరం రాసెయ్యాలి. అనుకున్నాను.

మరో పావుగంటకి సెలవు తీసుకుందామని లేచేను. "అప్పుడప్పుడు మా ఇంటికి రా నాయనా!' అంది నా ఊహా ప్రేయసి తల్లి. "ఆదివారం మీ ఆఫీసుకి సెలవేగా, రాకూడదూ చెస్ ఆడుకుందాం!" అన్నారు కాబోయే మామగారు. 'అసలావిడ' మాత్రం ఓ క్రీగంట నన్నో చూపుచూసి తలకిందికి దించేసుకుంది.

రూమ్‌కి చేరినవెంటనే మా నాన్నగారికి ఉత్తరం రాసేసేను. 'పిల్ల నచ్చింది. కట్నం తీసుకోవద్దు. చదువు పాడౌతుంది కనక ఆ అమ్మాయి పరీక్షలు పూర్తయ్యేవరకూ పెళ్ళి వీల్లేదు. ఈలోగా నేను హోటలు మెతుకులు తింటాను.' అంటూ రాసేను. ఆ రోజు నుంచీ ఉబుసు పోకపోవడం అంటే ఏమిటో తెలిలేదు నాకు. ఇంట్లో-ఆఫీసులో-ఎక్కడైనాసరే కాస్త వ్యవధి వుంటే చాలు....శశిరేఖ రూపాన్ని మనస్సులో నిలుపుకొనేవాడిని. రాత్రుళ్ళు కమ్మటికలలు కనేవాడిని...

ఓ రోజు మా కాబోయే మామగారు మా ఆఫీసుకొచ్చేరు...." 'మీ నాన్నగారు ఉత్తరం రాసెరు బాబూ, చాలా సంతోషం!' అని కాసేపు ఇంకేవో మాట్లాడేక వెళ్ళిపోయేరు. థేంగాడ్!- అంటే కాబోయే మామగారికీ - అత్తగారికీ అల్లుడు నచ్చేడన్నమాట. అందుకేగా - ఆ సంతోషం! ఇంతకీ శశిరేఖ సంతోషించిందో లేదో! ముఖ్యంగా శశిరేఖ అభిప్రాయం నేను తెలుసుకోగలిగితే ఎంత బాగున్ను....

అంతలో మా ఎదురింట్లో ఏవో కేకలూ పెడబొబ్బలూ వినిపించేయి. కిటికీతీసి కిందకిచూసేను. అలా చూస్తే ఎదురింట్లో జరిగేదంతా మేడమీదున్న నాకు స్పష్టంగా కన్పిస్తుంది. ఇంతకీ నేను చూసిందేమంటే - ఎదురింటి రామారావుగారు ఆయనగారి భార్య మణి కేశపాశాన్ని ఎడంచేత్తో పట్టుకుని కుడిచేత్తో ఆవిడగారి వీపుమీద గుభీగుభీమని బాదుతున్నాడు. 'చెప్పు....చెప్పు.... చెప్తావా లేదా?' అంటూ గొంతుతో దాటే చెయ్యిజోరు కూడా ఒక్కొక్కమెట్టే ఎక్కువ చేస్తున్నాడు. ఆవిడగారుమాత్రం ఆ చెప్పేదేదో' చెప్పకుండా 'బాబోయ్ నాయనోయ్ చంపేస్తున్నారు బాబోయ్!' అంటూంది. ఠపీమని తలుపు మూసేను.

రామారావుగారికి పెళ్ళయి రెండేళ్ళైనా పూర్తికాలేదు. ఇంతట్లోనే మొగుడూ పెళ్ళాం కొట్లాడుకుంటున్నారంటే దాని అర్థం ? ఒకరి అభిప్రాయానికి ఇంకొకరి అభిప్రాయం సరిపడటం లేదన్న మాట ! దానికి రెండేళ్ళు కూడా అక్కర్లేదు.... భార్యాభర్తలు కొట్టుకు చావడానికి; ఒక్కరోజు చాలాదూ ?? రామారావు స్థానంలో నన్నూ - ఆమె స్థానంలో శశిరేఖనీ ఒక్కసారి వూహించుకున్నాను. గుండె గుభేల్మంది ఒళ్ళు ఝల్లుమని బరువెక్కిపోయింది. నాదాంపత్య జీవితంమాత్రం ఇలా కాకూడదు! ఎన్నటికీకాకూడదు!!- అనుకున్నాను.

ఓరోజు ఏమీ తోచక కృష్ణ ఒడ్డుకి వెళ్ళేను. తలవని తలంపుగా శశిరేఖ కన్పించింది, శశిరేఖతోబాటు మరో ఇద్దరు అమ్మాయిలున్నారు. నన్నుచూసి పలకరిస్తుందేమోనని ఆశపడ్డాను, కాని, నన్ను చూస్తూనే తలని మరోపక్కకి తిప్పేసింది. చాలాసేపు చూసి - ఇక లాభం లేదనుకొని నేనే ధైర్యం చేసేమ.

"నమస్తే" అన్నాను శశిరేఖని చూస్తూ.

"నమస్తే" అంది శశిరేఖ కంగారుగా.

"కాస్త .... అలావస్తారా ? మీతో మాట్లాడాలి...." అన్నాను.

శశిరేఖ ఇబ్బందిగా తన ఫ్రెండ్స్ వంక చూసింది. 'శేరీ ఆన్ శశీ, శేరీ ఆన్ !' అన్నారు వాళ్ళిద్దరూ ముక్త కంఠంతో.

ఇద్దరం ఓ రెండు ఫర్లాంగులు ముందుకి నడిచేం. ఇసుప కమ్మీలమీద మోచేతులు ఆనించి, అరిచేత్తో కుడి చెంపని నిమురుకుంటో నిశ్చలంగా కృష్ణనీళ్ళని చూస్తోంది శశిరేఖ. మాట్లాడాలంటూ రమ్మన్నానుగానీ ఏం మాట్లాడాలో తోచటంలేదు నాకు. ఏదో ఒకటి మాట్లాడాలి....

"మా నాన్నగారికి వుత్తరంరాసేను. బహుశః మా నాన్నగారు ఈ పాటికి మీ నాన్నగారికి కూడా వుత్తరం రాసే వుంటారు. మీకు తెలుసా?" అన్నాను.

దృష్టి మరల్చలేదు శశిరేఖ. "తెలుసు. ఏదో రాశారట" అంది.

నిర్విణ్ణుడినయ్యేను. ఘోరం ! 'ఏదో రాయడం ఏమిటి ? ఏఁవిఁటీ అమ్మాయిగారి వుద్దేశ్యం ?

"ఆ 'ఏదో' ఏఁవిఁటో మీకు తెలుసా ?" అసలు సంగతి లాగుదామని.

"తెలుసు"

"మరి, మీ అభిప్రాయం ?"

"మా నాన్నగారి ఇష్టం ..."

"మీకంటూ ఓ ఇష్టం లేదా ?"

శశిరేఖ మౌనం వహించింది-

"ఏమంటారు ? మీరు నాకు నచ్చడం ఒకటే ముఖ్యంకాదు. నేను కూడా మీకు నచ్చాలిగా- ఏమంటూరు ?" అంటూ ఆశగా ఆమెవేపు చూసేను.

ఆమె తలెత్తి నిర్వికారంగా నా కళ్ళ లోకి రెండు సెకన్లపాటు చూసి మళ్ళీ చప్పున తల దించేసింది.

"మాట్లాడరేం? మాట్లాడండి ప్లీజ్!"

శశిరేఖ నొచ్చుకుంటున్నట్టు చూసి "అబ్బే అదేం లేదు .... చెప్పాగా మానాన్నగారిష్టమే నా ఇష్టమూనూ ...."

"మీ నాన్నగారిష్టం మీ ఇష్టం ఎలా గౌతుంది?"

ఆమె ఓ నిమిషం కింది చూపులు చూసింది. తర్వాత తన ఫ్రెండ్స్ వేపు చూసింది. చటుక్కున నావేపు తల తిప్పింది. చెవ్వులకున్నరింగులు దీపాల వెలుగులో తళుక్కుమన్నాయి. శశిరేఖ కళ్ళల్లోకూడా ఆ కాంతి ప్రతి ఫలించిందేమో అన్పించింది. 'సారీ, లేటయింది ... నేను వెళ్తొస్తాను....' అంటూ నా సమాధానం కోసమేనా ఆగకుండా, గబగబనడిచి వెళ్ళిపోయింది. ఆ నడకలో ఎన్ని వయ్యారాలు.... ఎంత హుందాతనం!

ఉస్సురంటూ నిట్టూర్చేను.

నేనడిగిన ప్రశ్నకిమాత్రం సరైన సమాధానం రాలేదు. అదే విచారం పట్టుకుంది నాకు. పోనీ, ఆ అమ్మాయికి సిగ్గు - కాబట్టి చెప్పలేదంటే ఎలా నమ్మడం! బి. ఏ. చదువు కుంటోంది. తల్లిదండ్రులకి ఒక్కర్తే కూతురు. బహుశా గారాబంగా పెరిగి వుండాలి. మనసులోని మాట-చెప్పే గుణం ఈ పాటికి అలవడే వుండాలి. పోనీ - నేను నచ్చలేదా అంటే 'మా నాన్నగారిష్టమే నా యిష్టం...' అంటోందిగా. ఏంవిటో ఈఆడాళ్ళు.... మనసులోనిమాట సరిగ్గా చెప్పరు. సగంచెప్పి మిగతా సగం వూహించు కోమంటారు....ఒకవేళ - నరసింహ మూర్తిగారు శశిరేఖని ఈ పెళ్ళికి బల వంతంగా ఒప్పిస్తున్నారేమో! శశిరేఖ ఇంతకి ముందు ఎవర్నేనా ప్రేమించిం దేమో....! అనుమానం అన్నది రావాలేగాని అది ఒప్పుకోవడం మహాకష్టం. చాలా గట్టి ప్రయత్నం చేసి —మనస్సు దిటవు చేసుకున్నాను.


ఆ రోజు ఆదివారం. ఉదయం ఆలస్యంగాలేచి సత్యజిత్‌రాయ్ సినిమా "చారులత" మార్నింగ్ షో చూసేను. భోజనంచేసి, మంచంమీద వాలేను గానీ - మనస్సులో ఆనాటి శశిరేఖ రూపం చెరిగిపోవడం లేదు. నేను ఆమెకి మనస్ఫూర్తిగా నచ్చినదీ లేనిదీ తెలుసుకోవడం ఎలా? అంచేత నర సింహామూర్తిగారింటికి వెళ్ళకతప్పదు. వెళ్ళినా "ఆమెగారు" నోరు విప్పు తుందా? ఆ నరసింహమూర్తిగారితో చదరంగం ఆడ్డానికి వెళ్తేనేం? వెళ్ళక పోతే ఏం? పదిసార్లు వాళ్ళింటికి వెళ్తే లోకువ అయిపోతానేమో! చాలాసేపు ఆలోచించేక ఓ నిర్ణయానికి వచ్చేను. నరసింహామూర్తిగారు రాజా మంత్రీ ఏనుగూ గుర్రం శెగటూ అంటూ బోరు కొట్టినా - ఆయనగారి భార్యామణిగారు మీ తాతెవరు, మీ నాయనమ్మెవరు, మీ



మేనమామ తండ్రెవరు అంటూ వంశవృక్షంఆరాలోమహాబోరుకొట్టినా - శశిరేఖని చూడాలి! చూస్తే గాని నా ఆరాటం తగ్గదు. మండుటెండలో తార్రోడ్డుమీదున్నమామిడిపండులానాఒళ్ళు వేడిగా వుడికిపోతోంది.

శశిరేఖ చల్లని చూపులు....దయగల దృష్టి నన్ను తాకాలి....గబ గబ లేచి స్నానం చేసేను. ట్రిమ్‌గా డ్రెస్ చేసుకుని కిందికి దిగేను.

గుణదల ఇంకా అరమైలు దూరం వుంది. స్కూటర్‌ని సాధ్యమైనంత నెమ్మదిగా పోనిస్తున్నాను. ఇద్దరు స్టూడెంట్స్ సైకిల్ మీద డబుల్స్ వెళ్తూ నన్ను ఓవర్ టేక్ చేసి - వెనక్కి తిరిగి నన్ను చూసి నవ్వుకోడం మొదలెట్టేరు. ఏక్సిలేటర్ ఇంకా స్లోడౌన్ చేసి వాళ్ళు పటపట లాడిం



చేసు. రయ్యమని తొక్కుకుంటూ చాలాముందుకి వెళ్ళిపోయేరు వాళ్ళు.... ఓపక్క నా బుర్రలోకి ఆలోచన

గొడవచేస్తూ జొరబడ్తున్నాయి .... ఇంకా సేపట్లో నరసింహామూర్తి గారి మేడ వచ్చేస్తుంది. "ఆర్. నరసింహ మూర్తి అండ్ కో.. ఇంజనీరింగ్ కంట్రాక్టర్స్" అన్న బోర్డు తగిలించి వుండే ఇనుపకమ్ముల గేటు దగ్గర స్కూటర్ ఆపి హారన్ కొట్టాను. పక్కనున్న ఔట్ హౌస్‌లోని పని మనిషో తోటమాలో వచ్చి గేటు తీస్తాడు. "అయ్యగారున్నారా?" అనడుగుతాను. వుంటే వున్నారంటాడు. లేకపోతే లేరంటాడు. కాని, ఇవాళ ఆదివారం. నరసింహమూర్తిగారు తప్పకుండా ఇంట్లోనే వుంటారు. పోర్టికోలో వాహనం ఆపి, మెట్లెక్కి డ్రాయింగ్ రూంలోకి వెళ్తాను. మూలనున్న రికార్డ్ ప్లేయర్ లోంచి సాధారణంగా బాలమురళీకృష్ణ గొంతుకో. రాజేశ్వర్రావు కంఠమో శ్రావ్యంగా వినిపిస్తూ వుంటుంది. చదరంగం బోర్డు ఎదురుగా పెట్టుకుని - ఓ చేత్తో "ఛెస్

ప్రాబ్లెమ్స్" పుస్తకం పట్టుకుని తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంటారు మూర్తిగారు. సూదీదారం ముందేసుకుని, దిండు గలీబుకి డిజైనో, రుమాలు మీద అక్షరాలో చెక్కుతూ కూర్చుంటుంది ఆయన సతీమణి. ఏ మోటుమనిషి కంపోజ్ చేసిందో - ఏ బండమనిషి స్ట్రయిక్ చేసిందో - అంతకన్నా ఇంకే మహాత్ముడు బైండ్ చేసిందో - ఓ షేక్స్పియర్ నాటకాన్ని తామర తూడుల్లాంటి సుకుమారమైన చేతుల్తో అతి ఆప్యాయంగా పట్టుకుని, ఆ అక్షరాల్లో లీనమైపోయి వుంటుంది శశిరేఖ. నన్ను చూడగానే నరసింహమూర్తిగారు "రా వోయ్, రా!" అంటారు. ఆయనగారి సతీమణి సూదీదారం పక్కన పడేసి, "ఏం బాబూ, ఇన్నాళ్ళకి జ్ఞాపకమొచ్చేమా?" అంటుంది. మరి శశి.... శశిరేఖ ఏమంటుంది? వెన్నెలకన్నా చల్లగా, మల్లెలకన్నా తెల్లగా - నవ్వి పలకరిస్తుందా? నన్ను చూసిన హర్షాతిరేకంతో - అందంగా వ్యాపించే నున్నని బుగ్గల మీది చిరునవ్వుని షేక్స్పియర్ "హేమ్లేట్"తో కప్పేస్తుందా? ఏమో - ఆనాటి సంఘటనతో ఆ ఆశ నాకు లేకుండా పోయింది. పుస్తకానికి అతుక్కుపోయివున్న కళ్ళని బరువుగా ఎత్తి ఓ జడపదార్థాన్ని - లేకపోతే వాళ్ళింట్లోని రెఫ్రిజిరేటర్నో - ఎలక్ట్రిక్ హీటర్నో - సోఫానో - రేడియోనో, గోడమీది పెయింటింగునో

చూసినట్టు చూస్తుంది. మళ్ళీ మామూలుగా పుస్తకంలో మునిగిపోతుంది.... ఈ ఆలోచన రాగానే స్కూటర్కి సడెన్ బ్రేకు వేసేను. వెనక్కి పోదామా అనిపించింది ఓ క్షణం. తీరా ఇంత దూరం వచ్చి శశిరేఖని చూడకుండా వెళ్ళిపోవడమెలా? మళ్ళీ స్కూటర్ స్టార్టు చేయబోయేంతలో - "రండి బాబూ!" అంటూ గేటు తెరుస్తూన్న తోటమాలి కనిపించేడు. ఆలోచిస్తూనే ఇంతదూరం వచ్చేశానా అని ఆశ్చర్యపోతూ లోపలికి వెళ్ళేను, పోర్టికోలో స్కూటర్ ఆపి మెట్లెక్క సాగేను. గేటు మూసిన తోటమాలి పరుగు పరుగున వచ్చేడు. వాడి ముఖం చిచ్చుబుడ్డీలా వెలుగుతున్నాది.

"అయ్యగారున్నారా?" అన్నాను.


"లేరుబాబూ. అయ్యగారూ, అమ్మగారూ సుట్టాల్ని దిగబెట్టడానికి టేశన్కెల్లేరు...."

చిన్నమ్మగారున్నారా ?"

"వున్నారు. లోపలికెల్లి కూకోండి బాబూ!" అన్నాడు హుషారుగా.

వాడి మాటల్నిబట్టి ఈ ఇంట్లో నేను ముమ్మందు సంపాదించబోయే స్థానం సంగతి వాడిక్కూడా తెల్సిపోయిందన్నది నాకు బోధపడింది. నవ్వుకుంటూ డ్రాయింగ్ రూంలోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నాను. లోలోపల నాకు చాలా సంతోషంగా వుంది. శశిరేఖతో ఏకాంతం ఎంత అదృష్టం! ఇదే మంచి సమయం.

మొదట్లో నేననుకున్నట్టు కాక - రికార్డ్ ప్లేయర్‌నుంచి 'కంసెప్టెంబర్' మ్యూజిక్ వస్తోంది. గాలికి పల్చటి తెరలు అటూ ఇటూ కదుల్తున్నాయి. ఎక్కడో సన్నగా నీళ్ళ చప్పుడు. డ్రాయింగ్ రూంకి బహుశా అటువేపు స్నానాలగది వుందేమో। ఒక్కసారి మత్తుగా కళ్ళు మూసేను. స్నానం చేస్తోన్న శశిరేఖని వూహించుకోడానికి ప్రయత్నించేను. కాని అది అసాధ్యం



అయింది. చీరచెంగుని బుజాలచుట్టూ కప్పుకుని పెద్దముత్తయిదువలాకనబడే శశిరేఖ నాకు దర్శనమిస్తోంది.... సిగరెట్టు వెలిగించి పొగమేఘాలొదిలేను ...అంతలో నీళ్ళ చప్పుడు ఆగిపోయింది. తలుపు గభాలున తెరిచిన చప్పుడూ ఆవెంటనే మూసినచప్పుడూ విన్పించేయి. తర్వాత 'సూరమ్మా, సూరమ్మా' అంటూ పనిమనిషిని పిలుస్తోన్న శశిరేఖ కంఠం విన్పించింది. ఆ సూరమ్మ గొంతుమాత్రం వినబడలేదు. చప్పుడైతే లోపల గుమ్మంవేపు చూసేను. సూరమ్మకోసం వెతుకులాడే కళ్ళతో-తడి ఒంటిమీద పల్చని తడిచీరతో - అక్కడ నిలబడ్డ శశిరేఖ నన్నుచూడగానే గిరుక్కున వెనక్కి తిరిగి దాదాపు పరిగెట్టినంత పనిచేసింది. ఈ హడావుడిలో నా చేతిలోని సిగరెట్టు కాస్తా నేలపాలైంది.

మళ్ళీ నాకు భయం పట్టుకుంది. నేరకపోయి - కానివేళలో వచ్చేనురా భగవంతుడా అని తిట్టుకున్నాను. అసలె - మెతకమనిషి... ఈ సంఘటనతో మరి మొహం చూపించదేమో! నాకు మతిపోయినట్టయి దిగాలుగా కూచ్చున్నాను.

"కాఫీ తీసుకోండి" అన్న శశిరేఖ మాటల్తో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను.

ఎదురుగా శశిరేఖ. గులాబీరంగు బెర్లిన్ చీరా అదేరంగు జాకెట్టూ ధరించింది. ముఖంలో అందంగా హుందాగా వుండే గంభీరత. ఒంగి టీపాయ్‌మీద కాఫీకప్పు పెడ్తోంటే ఆమె ఒంటివాసనలు నా నాసాపుటాల్లోకి చరచర ప్రవేశించేయి. కాఫీ కప్పు తీసుకొని ఒక్కగుక్కలో తాగేసేను.

"మీగది నాకు చూపించరూ?" అన్నాను.

"రండి" అంటూ మేడమెట్లవేపు దారితీసింది. ఆమెని అనుసరించేన్నేను. ఓ చోట ఆగి 'ఇదే నా గది' అంటూ తలుపు తీసింది. లోపల ఒక మంచం, పుస్తకాల రేక్, చిన్న టేబిలూ, మూడు నాలుగు కుర్చీలూ వున్నాయి. ఫేన్ ఆన్‌చేస్తూ 'కూర్చోండి' అంది.

రేక్ దగ్గరకివెళ్ళి ఏమేం పుస్తకాలున్నాయో చూసేను. దాన్నిండా ఇంగ్లీషు పుస్తకాలే వున్నాయి. సామర్సెట్ మామ్, హెమింగ్‌లే, స్టీన్‌బెక్, జాక్‌లండన్, లారెన్స్, టేగోర్, ఆర్. కె. నారాయణ్ రాసిన పుస్తకాలు ఎక్కువగా వున్నాయి. 'మంచి టేస్టే!' అనుకున్నాను.

"క్లాసు పుస్తకాలు చదవడమే మనవాళ్ళకి ఈ రోజుల్లో అబ్బురం. అలాంటిది - మీరు అవీ ఇవీ చదవడానికి ఎలా తీరుబాటుచేసుకున్నారో!?" అన్నాను సగం ప్రశ్నలా, సగం ఆశ్చర్యార్థకంలా.

"తీరుబాటుదేముంది? ముందు

ఇంటరెస్ట్ అన్నది వుండాలి" అంది తను కూడా నా ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ.

నేను గొంతు తడి చేసుకున్నాను. పక్నల పొదిలోంచి ఒక్కొక్కటే తీసి ఆమె మీదకి ప్రయోగించడానికి నన్ను నేను సిద్ధం చేసుకున్నాను.

"నేనివాళ మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడ్డానికి వచ్చేను.... దీని మీదే మనిద్దరి భవిష్యత్తు ఆధారపడి వుంది. ఏమంటారు?"

"అడగండి" అంది.

"ఆవేళ సాయంత్రం నేనడిగిన ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోయేరేం? సిగ్గా? ఇష్టం లేకా..?"

శశిరేఖ నా వేపు బెదురుచూపులు చూ ంది. "అదేంకాదు; అప్పటికే ఆలస్యమైపోయింది ... పైగా ఫ్రెండ్స్ వున్నారు ..." అంది.

ఈ సమాధానం నాకు సంతృప్తి కలిగించలేదు. పైగా నా ఆత్రుతని మరింత ఎక్కువ చేసింది. "పోనీ, ఇప్పుడు చెప్పండి .... నేను మీకు నచ్చేనా లేదా?" అన్నాను రెట్టిస్తూ.

నన్నే సూటిగా చూస్తున్న శశిరేఖ ఆ మాటతో దృష్టి పక్కకి మళ్ళించింది. అంతవరకూ నిశ్చలంగావున్న అందమైన ఆమె ముఖాన్ని - ఏవో కనిపించని గీతలు అంత అందమైనది కాకుండా చేసేయి. నా ప్రశ్నకి ఆమెలో చిరాకు పుట్టుకొచ్చిందేమో ... అది సిగ్గుమాత్రం కాదని నా అనుమానం.

"మీకు చెప్పేనుగా....మా అమ్మా నాన్నా ఎలా అనుకుంటారో ఆ ప్రకారంగా నడవడమే నా ధర్మం. వాళ్ళ ఇష్టమే నా ఇష్టం!" అంది.

ఏం దారి? ఏం చెయ్యడం?

సరే, నేనంటే మీకు ఇష్టమేనని అనుకుంటాను. మా వాళ్ళతో చెప్పి పెళ్ళిని మీ చదువు పూర్తయ్యేవరకూ వాయిదా పడేలా చేస్తాను. చదువు పూర్తయింతర్వాత ఏదేనా ఉద్యోగం చెయ్యాలన్న సరదా మీకుందా?" అన్నాను వాతావరణాన్ని కాస్త ఆహ్లాదంగా మారుద్దామని.

కాని, శశిరేఖ ముఖకవళికలు ఏమాత్రం మారలేదు. కనీసం మొహంలో కొంచెం ఎర్రదనమేనా రాదా అనుకున్నాను. అదీలేదు. చాలా నిరుత్సాహపడ్డాను.

"అప్పటి సంగతికి ఇప్పుడేం తొందర?" అంది నిర్లిప్తంగా.

దాంతో నాలోని ఉత్సాహమంతా పూర్తిగా నీరు కారిపోయింది. తమాయించుకుని కూర్చున్నాను.

"అంత సీరియస్‌గా వున్నారేం?"

"అబ్బే లేదే!"

"నవ్వితే మీరింకా అందంగా వుంటారు" అన్నాను లేస్తూ.

ఈసారి మనస్ఫూర్తిగా నవ్వింది. అమ్మయ్య - అనుకున్నాను. తను కూడా లేచి నిలబడింది.

పెళ్ళింకా ఆరునెలయింది. అందాకా ఓ చిన్న ము........!" అంటూ ఆమె

వేపు తిరిగేను. కాని అలా జరగలేదు. జరగకముందే చరాలున నాలుగడుగులు వెనక్కి వేసి 'దయచేసి మీరు వెళ్ళిపొండి' అంది శశిరేఖ.

నా గుండెల్లో పిడుగులు పడ్డాయి. వెధవపని చేసేననుకొంటూ రెండు క్షణాలలాగే నిలబడిపోయేను.

"క్షమించాలి .... తొందరపడ్డాను" అన్నాను.

"ఫర్వాలేదు." అంది. గొంతులో అదే నిర్లిప్తత. అదే నిర్వికారం.

"నా ఈ ప్రవర్తన మీ అభిప్రాయాన్ని మార్చిందా, శశీ ?" అన్నాను మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

"లేదు"

"థాంక్స్"

"నో మెన్షన్"

"పెళ్ళి వచ్చేవారమే ఏర్పాటు చేయిస్తే మీకేమేనా అభ్యంతరమా ?"

"మా నాన్నారిని కనుక్కోండి"

"అమ్మయ్య" అని వూపిరి పీల్చుకున్నాను.

"నన్ను పోర్టికో వరకూ దిగబెట్టరూ ?" అన్నాను సిగరెట్టు తీసి వెలిగించుకుంటూ.

అమ్మాయి అందమైంది. ఆరోగ్యంగా వుంది. చదువు కున్నది. చదువుకుంటోంది కాని, ఏమిటీ వింత

---


## ఆంధ్ర పాఠకలోకానికి 'విజయబుక్స్'వారి కానుకలు

ట్రెడిషనల్ ఇండియన్ కల్చర్ అండ్ అదర్ ఎస్సేస్ (ఆంగ్లం) రచన : శ్రీ వి. ఆర్. నార్ల — రు. 20—00

స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ తెలుగు జర్నలిజం (ఆంగ్లం) వివిధ ప్రసిద్ధ రచయితల వ్యాసాలు, శ్రీ నార్ల షష్ట్యబ్ది ఉత్సవ సంఘ ప్రచురణ. — రు. 15—00

అల్పజీవి (నవల) శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి — రు. 4—00

ఆరు సారా కథలు శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి — రు. 2—00

ఇల్లాలి ముచ్చట్లు (వ్యాసాలు) శ్రీమతి పురాణం సీత — రు. 4—00

ఆరాధన (నవల) శ్రీమతి కోమలాదేవి — రు. 4—00

సృష్టిలో తీయనిది (కథలు) శ్రీ వాకాటి పాండురంగారావ్ — రు. 3—00

కలకంఠి (ఇతర కథలు) శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి — రు. 2—50

వివరాలకు ; "విజయ బుక్స్" మొగల్రాజపురం—విజయవాడ-2కు వ్రాయండి

ప్రవర్తన? సహజంగా స్త్రీల్లో కన్పించే లక్షణాలేవీ కన్పించవేం? పెళ్ళి జీవిత సమస్య. ఎలాంటి స్త్రీకయినా అందమైన సిగ్గు తెప్పించే సంఘటన. ఆ విషయాలు మాట్లాడ్తే - ఎవరి పెళ్ళో అన్నట్టు ఎంత ముభావం? అసలలా వుండగలగడం సాధ్యమా? స్త్రీ సహజమైన ఇన్‌స్టింక్ట్స్ ఈమెలో లోపించేయా? అలాంటి అమ్మాయితో కాపురం సుఖప్రదం అవుతుందా? - ప్రశ్నలు జోరీగల్లా నన్ను చుట్టేయి.

ఎదురుగా నిలబడ్డ శశిరేఖని మళ్లీ చూసేను. ముఖంలో కోపం, భయం, అసహ్యం నాకు స్పష్టంగా కన్పించేయి.

"పెళ్ళి ఎలాగూ నిశ్చయమైంది గదా - మరీ అభ్యంతరం ఎందుకు?" అన్నాను ఆమె వేపు జరుగుతూ.

శశిరేఖ మరింత వెనక్కి వెళ్ళింది. మరింత భయంగా చూసింది: డ్రాక్యులాని చూసినట్టు, 'పదండి' అంటూ గబగబ మెట్లవేపు నడిచింది. నేనూ వుస్సురంటూ అటే నడిచేను.

పోర్టికోలో ఆగేం ఇద్దరం....

అంత వరకూ మౌనం....

రెండు నిమషాలపాటు నిశ్చలంగా నిలబడి నిదానంగా శశిరేఖ వేపు చూసేను.

"క్షమించండి శశిరేఖా. ఓ విషయం నిస్సంకోచంగా చెప్తున్నందుకు ఏమీ అనుకోకండి. నా మనస్సు మార్చుకున్నాను, మీ నాన్నగార్ని మీ కోసం వేరే సంబంధం చూడమనండి....!"

అని ఆగి ఆమె ముఖంలోకి చూసేను. అదే నిర్లిప్తత. అదే మౌనముద్ర.

చరాలున స్కూటర్‌ని స్టార్ట్ చేసి రయ్యమని గేటు వేపు దూసుకుపోయేను.

శశిరేఖ అనే పెద్ద పూబిలో ఇరుక్కోకముందే నన్ను నేను రక్షించుకున్నానని సంతోషించేను....

ఇదీ అయిదేళ్ళ కిందటి కథ....

* * *

అప్పటి శశిరేఖకీ ఇప్పటి శశిరేఖకీ ఎంత తేడా! ఎంత ఆశ్చర్యకరమైన మార్పు? అప్పుడు నిశ్చలంగా వుండే చెరువులా స్తబ్ధుగా వుండేది. ఇప్పుడో - గలగలా పారే సెలయేరులా నృత్యం చేస్తోంది. అప్పుడు భయంతో ముకుళించుకుని వుండే మల్లెమొగ్గలా వుండేది. ఇప్పుడో రేకులు అర విరిసిన మల్లెపూల జల్లులా వుంది.

ఎలా వచ్చిందీ మార్పు?

ఏమిటీ రహస్యం!

నాకేం అంతుపట్టలేదు.

మా ఇంటి పక్క శేషగిరిరావుగారని ఒకాయన వున్నాడు. ఆయనిలాంటి విషయాల్లో మాంచి అనుభవజ్ఞుడు. విషయం అరటిపండు ఒలిచినట్లు చెప్పి ఏమిటో వివరించమన్నాను. ఆమెలో ఈ మార్పు హఠా

త్తుగా వచ్చిందా? లేక నా దృష్టిలోనే ఏదేనా లోపం వుందా? — అనడిగేను.

ఆయన నేను చెప్పినదంతా సావధానంగా విన్నాడు. విని — పెద్ద వేదాంతిలా గంభీరంగా ముఖం పెట్టి — నిశ్శబ్దంగా నవ్వేడు.

కాని, జవాబు చెప్పలేదు.

చెప్పమని నేను మరీ బలవంతం చేస్తే — "చెప్పడానికేముంది గురువుగారూ! అదంతే!" అని మాత్రం అన్నాడు.

నాకింకా పెళ్ళి కాలేదు.

నచ్చే పిల్లకోసం మావాళ్ళూ నేనూ మా ప్రయత్నాలు మేం చేస్తూనే వున్నాం.

నచ్చే పిల్ల దొరుకుతుందో దొరకదో!

దొరికిన పిల్ల నచ్చుతుందో నచ్చదో!!

...


## సరియైన అడ్రసు

మాచవరం పోస్టు
విజయవాడ–4

**JYOTI**
**MACHAVARAM P. O**
**VIJAYAWADA-4**

ఆఫీసు మాచవరంకు మార్చామన్న సంగతి ఇదివరకే తెలియపర్చాం. కాని, ఇంకా కొంతమంది పాఠకులు, రచయితలు, ఏజంట్లు బకింగ్‌హామ్ పేట పోస్టు విజయవాడ-2 అనే రాస్తున్నారు. ప్రక్కనే ఇచ్చిన సరైన అడ్రసను గమనించవలసిందిగా కోరిక.